# బీమాలోకి 100% ఎఫ్‌డీఐ!

## అనుమతించే యోచనలో కేంద్రం • కీలక సంస్కరణలకు ప్రతిపాదనలు




న్యూఢిల్లీ, నవంబర్ 18: దేశీయ బీమా రంగంలో విదేశీ ప్రత్యక్ష పెట్టుబడుల (ఎఫ్‌డీఐ)కు కేంద్రంలోని నరేంద్ర మోదీ సర్కారు తలుపులు బార్లా తెరువబోతున్నదా? అంటే అవుననే సంకేతాలే కనిపిస్తున్నాయిప్పుడు. బీమా రంగంలో కీలక సంస్కరణలకు సిద్ధమవుతున్న కేంద్ర ప్రభుత్వం.. అందులో భాగంగానే 100 శాతం ఎఫ్‌డీఐకి కూడా గ్రీన్‌సిగ్నల్ ఇవ్వబోతున్నట్టు తెలుస్తున్నది. ఓ ప్రముఖ జాతీయ దినపత్రిక తాజాగా తెచ్చిన నివేదికలోని వివరాల ప్రకారం ఈ నెలాఖర్లో పార్లమెంట్‌కు వచ్చే వీలున్న ప్రతిపాదిత బీమా చట్ట సవరణ బిల్లులో పూర్తిగా విదేశీ బీమా కంపెనీలకు అనుమతివ్వబోతున్నారని సమాచారం. అయితే భారత్‌కు చెందిన బజాజ్ ఫిన్‌సర్వ్ వంటి కంపెనీల భాగస్వామ్యంతో దేశీయ బీమా రంగంలో సేవలందిస్తున్న అలియాంజ్ తరహా విదేశీ సంస్థలు ఈ జాయింట్ వెంచర్లకు గుడ్‌బై చెప్పి సొంతంగా బీమా కంపెనీలను ఏర్పాటు చేయాలని చూస్తున్న తరుణంలో ఈ మార్పులకు మోదీ సర్కారు ప్రయత్నిస్తుండటం గమనార్హం.

### ప్రస్తుతం 74 శాతమే

దేశంలో ఉన్న బీమా కంపెనీల్లో ప్రస్తుతం ఎఫ్‌డీఐకున్న పరిమితి 74 శాతమే. అంటే.. ఇన్సూరెన్స్ కంపెనీ యాజమాన్యంలో విదేశీయుల వాటా ఏ రకంగానూ 74 శాతాన్ని మించరాదు. 26 శాతం తప్పకుండా భారతీయుల వాటా ఉండాల్సిందే. అయితే కొత్త బిల్లులో ఈ పరిమితిని పూర్తిగా ఎత్తివేయనున్నట్టు తెలుస్తున్నది. దీంతో విదేశీ కంపెనీలు భారత్‌లో ఇక్కడి కంపెనీల భాగస్వామ్యం లేకుండానే సొంతంగా బీమా సంస్థలను పెట్టుకోవచ్చన్నమాట. ఇన్సూరెన్స్ మార్కెట్‌లో ఇక స్వతంత్రంగా వ్యాపార కార్యకలాపాలు చేసుకోవచ్చు. తమ ఈ నిర్ణయం వల్ల భారతీయ బీమా రంగం బలోపేతమవుతుందని, విదేశీ పెట్టుబడులు పెద్ద ఎత్తున వస్తాయని, మార్కెట్‌లో పోటీ కూడా పెరిగి చౌక ధరలకే బీమా అందరికీ అందుతుందని కేంద్ర ప్రభుత్వ వర్గాలు చెప్తున్నాయి. అయితే స్థానిక సంస్థలకున్న అవకాశాలను ఇది దెబ్బతీస్తుందన్న ఆందోళనలు అటు మార్కెట్ వర్గాల నుంచి, ఇటు నిపుణుల నుంచి వ్యక్తమవుతున్నాయి.

### ఎల్ఐసీ కోసం

బీమా చట్టం సవరణతో కేంద్ర ప్రభుత్వం తేవాలని చూస్తున్న మార్పులు.. ప్రభుత్వ రంగ జీవిత బీమా దిగ్గజం లైఫ్ ఇన్సూరెన్స్ కార్పొరేషన్ (ఎల్ఐసీ) విస్తరణకూ అవకాశాలు కల్పించేలా ఉన్నాయని ఇండస్ట్రీ వర్గాలు చెప్తున్నాయి. కొత్త చట్టం అమలుతో ఆరోగ్య బీమా కంపెనీ దిశగా ఎల్ఐసీ అడుగులు పడుతాయని అంటున్నారు. ఇప్పుడున్న నిబంధనల ప్రకారం ఇది సాధ్యం పడడం లేదు. ఇదిలా ఉంటే బీమా రంగ నియంత్రణ సంస్థ ఐఆర్డీఏఐ కూడా లైసెన్సులకు సంబంధించి కొన్ని మార్పులను చేయాల్సి వస్తుందని అంటున్నారు.

### మరిన్ని మార్పులు

ఇప్పుడున్న బీమా చట్టాన్ని సవరిస్తూ తెస్తున్న కొత్త చట్టంలో ఇన్సూరెన్స్ ఏజెంట్లపైనున్న ఆంక్షల్నీ తొలగించాలని కేంద్రం భావిస్తున్నది. ఏజెంట్లు రకరకాల సంస్థలకు చెందిన పాలసీలను స్వేచ్ఛగా అమ్ముకునే సదుపాయాన్ని తేవాలనుకుంటున్నారు. ప్రస్తుత నిబంధనల ప్రకారం ఒక ఏజెంట్ ఒకే సంస్థకు పని చేయాల్సి ఉన్నది. అయినప్పటికీ తమ కుటుంబ సభ్యుల పేర్ల మీద అనేక కంపెనీలకు ఒక్కరే ఏజెంట్లుగా పనిచేస్తున్నది గమనిస్తూనే ఉన్నాం. కానీ కొత్త చట్టంతో ఇదంతా చట్టబద్ధం కానున్నది. జీవిత, జనరల్ ఇన్సూరెన్స్ రంగాల్లో ఏజెంట్లు ఎన్ని సంస్థల పాలసీలనైనా అమ్ముకోవచ్చు. దీని వల్ల దేశంలో బీమా పాలసీదారులు మరింత పెరుగుతారని కేంద్రం అభిప్రాయపడుతున్నది. కాగా, ప్రస్తుతం దేశంలో 24 జీవిత బీమా సంస్థలున్నాయి. మరో 26 జనరల్ ఇన్సూరెన్స్ కంపెనీలున్నాయి. అలాగే 6 ఆరోగ్య బీమా సంస్థలున్నాయి. వీటన్నిటికీ జనరల్ ఇన్సూరెన్స్ కార్పొరేషన్ (జీఐసీ) రీఇన్సూరర్‌గా వ్యవహరిస్తున్నది.

# కార్బన్‌డయాక్సైడ్ నుంచి మిథనాల్

## కోలిండియాతో కలిసి ప్లాంట్‌ను ఏర్పాటుచేస్తున్న సింగరేణి



హైదరాబాద్, నవంబర్ 18 (నమస్తే తెలంగాణ): దేశంలో మొదటిసారిగా కార్బన్‌డయాక్సైడ్ నుంచి మిథనాల్ తయారీకి సింగరేణి సంస్థ శ్రీకారం చుట్టింది. ప్రయోగాత్మక ప్లాంటును మంచిర్యాల జిల్లా జైపూర్‌లోని థర్మల్ విద్యుత్తు ప్లాంటులో ఏర్పాటు చేస్తున్నది. థర్మల్ ప్లాంట్‌లో బొగ్గును మండించడం ద్వారా వెలువడే కార్బన్‌డయాక్సైడ్‌ను హైడ్రోజన్ వాయువుతో మిలితం చేసి చివరగా మిథనాల్‌ను తయారుచేయనున్నారు. రోజుకు 500 కిలోల కార్బన్‌డయాక్సైడ్‌ను మిథనాల్‌గా మార్చే ప్రయోగాత్మక ప్లాంట్ నిర్మాణం తుది దశకు చేరుకున్నదని, డిసెంబర్ 31 నాటికి ఈ ప్లాంట్ పూర్తకాగలదని సంస్థ సీఎండీ ఎన్ బలరామ్ తెలిపారు. ఈ ప్లాంట్‌లో 99.9 శాతం కర్బన ఉద్ఘారాలను మిథనాల్‌గా మార్చేందుకు ఎలక్ట్రోస్టాటిక్ ప్రెసిపిటేటర్స్ (ఈఎస్‌పీ)ని నెలకొల్పామన్నారు. కోలిండియా అనుబంధ రీసెర్చ్ యూనిట్ సీఎం పీడీఐఎల్ సహకారంతో ఈ ప్లాంట్‌ను నిర్మిస్తున్నామని, ఇందుకోసం రూ.20 కోట్ల ఖర్చు చేస్తున్నట్టు, రోజుకు 180 కేజీల మిథనాల్‌ను తయారుచేస్తామన్నారు. ఈ మిథనాల్‌ను ఎరువులు, అక్రిలిక్, ప్లాస్టిక్, సింథటిక్, ఫైబర్ వస్త్రాలు, ప్లైవుడ్, పెయింట్స్ తయారీలో వినియోగిస్తారని తెలిపారు.

# మళ్లీ పెరిగిన బంగారం ధర



న్యూఢిల్లీ, నవంబర్ 18: గత కొద్ది రోజులుగా తగ్గుతూ వచ్చిన బంగారం మళ్లీ ప్రియమైంది. ప్రస్తుత పెండ్లిళ్ల సీజన్‌కావడంతో ఆభరణాల వర్తకులు, రిటైలర్లు ఎగబడి కొనుగోళ్లు జరపడంతోపాటు అంతర్జాతీయ మార్కెట్లో అతి విలువైన లోహాలకు డిమాండ్ ఊపందుకోవడంతో ధరలు పెరిగాయని ఆల్ ఇండియా సరాఫా అసోసియేషన్ వెల్లడించింది. గత నాలుగు రోజులుగా తగ్గుతూ వచ్చిన పుత్తడి ధర సోమవారం ఢిల్లీ బులియన్ మార్కెట్లో 99.9 శాతం స్వచ్ఛత కలిగిన తులం ధర రూ.400 పెరిగి రూ.77,450కి చేరుకున్నది. అంతకుముందు ధర రూ.77,050గా ఉన్నది. ఇటు హైదరాబాద్‌లో 24 క్యారెట్ ధర రూ.660 ఎగబాకి రూ.76 వేల పైకి రూ.76,310కి చేరుకున్నది. అలాగే 22 క్యారెట్ గోల్డ్ ధర రూ.600 ఎగబాకి రూ.69,950 పలికింది.

### 92 వేలకు వెండి

బంగారంతోపాటు వెండి కూడా వెలిగింది. పారిశ్రామిక వర్గాలు, నాణేల తయారీదారుల నుంచి కొనుగోళ్లు ఊపందుకోవడంతో కిలో వెండి ఏకంగా రూ.1,810 అధికమై రూ.92 వేలు పలికింది. అంతకుముందు ఇది రూ.90,190గా ఉన్నది. కానీ హైదరాబాద్‌లో మాత్రం రూ.99 వేల వద్ద స్థిరంగా ఉన్నది. అంతర్జాతీయ మార్కెట్లో గోల్డ్ ధర భారీగా పుంజుకోవడంతోపాటు దేశీయంగా కొనుగోళ్లు ఊపందుకోవడం వల్లనే ధరలు పెరిగాయని ఎల్‌కేపీ సెక్యూరిటీస్ వైస్ ప్రెసిడెంట్ జతిన్ త్రివేది తెలిపారు. అలాగే గ్లోబల్ మార్కెట్లో ఔన్స్ గోల్డ్ ధర 2,600 డాలర్ల పైన కదలాడుతుండగా, వెండి 26 డాలర్ల స్థాయిలో ఉన్నది.



## ఒకేరోజు 5 లక్షల మంది

### ఆదివారం ప్రయాణించిన విమాన ప్రయాణికులు

న్యూఢిల్లీ, నవంబర్ 18: దేశవ్యాప్తంగా విమానాల్లో ప్రయాణించేవారు రికార్డు స్థాయికి చేరుకున్నారు. ఆదివారం ఒకేరోజు ఏకంగా 5 లక్షల మంది దేశీయంగా విమానాల్లో ప్రయాణించారు. పండుగ, పెండ్లిళ్ల సీజన్‌కావడంతో ప్రయాణాలు చేసేవారు అధికంగా ఉన్నారని పౌరవిమానయాన మంత్రిత్వ శాఖ తాజాగా వెల్లడించింది. ఈ నెల 17న ఒకేరోజు దేశీయంగా నడిచిన 3,173 విమానాల్లో 5,05,412 మంది ప్రయాణించారని తెలిపింది.

**హైదరాబాద్‌లోనూ పెరిగారు..**

హైదరాబాద్ ఎయిర్‌పోర్ట్ నుంచి గత నెలలో విమాన ప్రయాణికులు 22 శాతం మేర పెరిగినట్లు జీఎమ్మార్ ఎయిర్‌పోర్ట్స్ తాజాగా వెల్లడించింది. అక్టోబర్ నెలలో 24.95 లక్షల మంది ప్రయాణించారు.

# రూ.50 లక్షల కోట్లు

## 35 రోజుల్లో ఆవిరైన మదుపరుల సంపద • స్టాక్ మార్కెట్లలో నష్టపుటేరులు



ముంబై, నవంబర్ 18: దేశీయ స్టాక్ మార్కెట్ల వరుస నష్టాలు.. లక్షల కోట్ల రూపాయల్లో మదుపరుల సంపదను హరించాయి. గత 35 రోజుల్లో (ట్రేడింగ్ సెషన్లలో) ఏకంగా రూ.50 లక్షల కోట్లకుపైగా మార్కెట్ విలువ పడిపోయింది మరి. ఈ ఏడాది సెప్టెంబర్ 27న బాంబే స్టాక్ ఎక్స్చేంజ్ (బీఎస్ఈ) నమోదిత సంస్థల మార్కెట్ విలువ రూ.478.93 లక్షల కోట్లుగా ఉంటే.. ఈ నెల (నవంబర్) 18న అది రూ.428.67 లక్షల కోట్లకు క్షీణించింది. దీంతో రూ.50.26 లక్షల కోట్లు ఆవిరైనట్టైంది. బీఎస్ఈ ప్రధాన సూచీ సెన్సెక్స్ 8,639.24 పాయింట్లు దిగజారింది. సెప్టెంబర్ 27న సెన్సెక్స్ ఆల్‌టైమ్ హై 85,978.25 పాయింట్ల వద్ద ఉన్నది.

### తరలిపోతున్న ఎఫ్ఐఐలు

భారతీయ మార్కెట్లకు విదేశీ సంస్థాగత మదుపరులు (ఎఫ్ఐఐ) దూరం జరుగుతున్నారు. స్టాక్ మార్కెట్లు ట్రేడైన గత 35 రోజుల్లో రూ.1.15 లక్షల కోట్ల పెట్టుబడులను వెనక్కి తీసుకున్నారు. ఇక ఎఫ్ఐఐలుసహా విదేశీ పోర్ట్‌ఫోలియో మదుపరులు (ఎఫ్‌పీఐలు) గత నెల ఒక్క అక్టోబర్‌లో తరలించుకుపోయిన పెట్టుబడుల విలువే రూ.1,13,858 కోట్లుగా ఉన్నది. ఈ నెల మొదలు ఇప్పటిదాకా దాదాపు మరో రూ.23వేల కోట్లను తిరిగి లాగేసుకున్నట్టు నేషనల్ సెక్యూరిటీస్ డిపాజిటరీ లిమిటెడ్ (ఎన్ఎస్‌డీఎల్) గణాంకాలు చెప్తున్నాయి. చైనా, జపాన్ మార్కెట్లు ఆకర్షణీయంగా కనిపిస్తుండటం, దేశంలో పెరుగుతున్న ద్రవ్యోల్బణం, నిరాశాజనకంగా నమోదవుతున్న కార్పొరేట్ సంస్థల త్రైమాసిక ఆర్థిక ఫలితాలు, ఫెడ్ రిజర్వ్ వడ్డీరేట్ల కోతలు వంటివి భారత్‌కు ఎఫ్‌పీఐలను దూరం చేస్తున్నాయని మార్కెట్ విశ్లేషకులు చెప్తున్నారు. డాలర్‌తో పోల్చితే రూపాయి మారకం విలువ ఆల్‌టైమ్ కనిష్ఠాలకు పడిపోతుండటం కూడా మార్కెట్ సెంటిమెంట్‌ను దెబ్బతీస్తున్నది. అమెరికా అధ్యక్ష ఎన్నికల్లో డొనాల్డ్ ట్రంప్ విజయం సాధించడంతో డాలర్ ఇండెక్స్ పెద్ద ఎత్తున బలపడిన విషయం తెలిసిందే. ఈ పరిణామం రూపాయిపై సహజంగానే ప్రభావం చూపుతున్నది.

| ప్రధాన కారణాలు |
|---|
| విదేశీ పెట్టుబడుల ఉపసంహరణ |
| అమెరికా ఎన్నికల్లో ట్రంప్ విజయం |
| డాలర్‌తో పోల్చితే రూపాయి మారకం విలువ పతనం |
| పేలవమైన త్రైమాసిక ఆర్థిక ఫలితాలు |
| విజృంభించిన ద్రవ్యోల్బణం |
| లాభాల స్వీకరణ దిశగా మదుపరులు |

### కోలుకోని సూచీలు

సెన్సెక్స్, నిఫ్టీలు మళ్లీ నష్టాలకే పరిమితమయ్యాయి. సోమవారం ఉదయం ఆరంభం నుంచే సెల్లింగ్ ప్రెషర్ కనిపించగా.. ఐటీ, చమురు షేర్లు అమ్మకాల ఒత్తిడిని ఎదుర్కొన్నాయి. సెన్సెక్స్ 241.30 పాయింట్లు లేదా 0.31 శాతం క్షీణించి 77,339.01 వద్ద నిలిచింది. ఒకానొక దశలో 615.25 పాయింట్లు కోల్పోవడం గమనార్హం. ఇక నేషనల్ స్టాక్ ఎక్స్చేంజ్ (ఎన్ఎస్ఈ) సూచీ నిఫ్టీ కూడా 78.90 పాయింట్లు లేదా 0.34 శాతం దిగజారి 23,453.80 వద్ద ముగిసింది. నిఫ్టీకి వరుసగా ఇది ఏడోరోజు నష్టం.

## ఐఎస్‌బీకి నూతన లోగో

హైదరాబాద్, నవంబర్ 18: ది ఇండియన్ స్కూల్ ఆఫ్ బిజినెస్ నూతన లోగోను ఆవిష్కరించారు. బ్రాండ్‌ను అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు తీసుకురావాలనే ఉద్దేశంతో నూతన లోగోను ఆవిష్కరించినట్లు ఒక ప్రకటనలో తెలిపింది. ఈ పరిణామం ఐఎస్‌బీ వారసత్వానికి, ఆశయానికి అనుగుణంగా ఉంటుందని పేర్కొంది.

## ఎస్బీఐ మరో 500 శాఖలు

ముంబై, నవంబర్ 18: ప్రస్తుత ఆర్థిక సంవత్సరం ముగిసేనాటికి దేశీయ బ్యాంకింగ్ దిగ్గజం ఎస్బీఐ కొత్తగా 500 శాఖలను ప్రారంభించబోతున్నది. ఈ విషయాన్ని కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ వెల్లడించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ..అధిక వడ్డీ రేట్ల కారణంగా ప్రజలు తీవ్ర ఒత్తిడికి గురవుతున్నారని, దీంతో వృద్ధిపై ప్రతికూల ప్రభావం చూపుతున్నదని, ఈ నేపథ్యంలో బ్యాంకులు వడ్డీరేట్లను తగ్గించాలని సూచించారు.

# ఆరోగ్య సంరక్షణలో ఏఐ: శ్రీధర్‌బాబు

హైదరాబాద్, నవంబర్ 18(నమస్తే తెలంగాణ): తెలంగాణను త్వరలో క్వాంటమ్ కంప్యూటింగ్ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‌గా మారుస్తామని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు వ్యాఖ్యానించారు. 'ఆరోగ్య సంరక్షణ రంగంలో కృత్రిమ మేథ'పై హైదరాబాద్‌లో జరిగిన అంతర్జాతీయ సదస్సులో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రసంగించారు. హైదరాబాద్ ఆరోగ్య సంరక్షణలో కృత్రిమ మేధను విస్తృతంగా వినియోగించే దిశగా ముందుకు సాగుతున్నదని మంత్రి పేర్కొన్నారు. రేడియాలజీ రోగనిర్ధారణ పరీక్షల్లో స్పెషలిస్టు వైద్యులకు ఇప్పటికే ఏఐ తోడ్పాటునందిస్తున్నదని, పరిశోధనల ద్వారా దీనిని పూర్తి స్థాయిలో వినియోగించుకునేలా తగిన చర్యలు తీసుకోవాలని ఆయన పిలుపునిచ్చారు. ఏఐజీలో ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఆర్టిఫిషల్ ఇంటలిజెన్స్‌ను ఏర్పాటు చేసి ప్రపంచ ఆరోగ్యరంగానికి దిక్సూచిగా మారిన నాగేశ్వరరెడ్డి తమ పరిశోధనలను ఇంకా ముందుకు తీసుకెళ్లి రాష్ట్ర ప్రతిష్ఠను పెంచాలని శ్రీధర్ బాబు కోరారు. ఏఐజీలో కృత్రిమ మేథతో పనిచేసే 'మిరా' అనే వర్చ్యువల్ వైద్య సహాయకురాలిని ప్రవేశ పెట్టి ఈ రంగంలో ఆయన ఆదర్శప్రాయులుగా మారారని శ్రీధర్ బాబు కొనియాడారు.

# ఆగని ఇసుక అక్రమ రవాణా



సారపాకలో ట్రాక్టర్ ద్వారా ఇసుక రవాణా




పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేస్తున్న ఆర్ఐ, డీటీలు

బూర్గంపహాడ్, నవంబర్ 18 : అక్రమ ఇసుక రవాణాను అడ్డుకునేందుకు వెళ్లిన రెవెన్యూ అధికారిపై ఇసుక మాఫియా దాడి చేసి 24 గంటలు గడవకముందే సారపాకలో మరోవైపు ఇసుకాసురులు జోరుగా ఇసుక అక్రమ రవాణా సాగిస్తున్నారు. రెవెన్యూ అధికారిపై ఇసుక మాఫియా దాడి ఘటన మండలంలో సంచలనం కలిగించినా.. ఇసుక మాఫియా ముఠాకు చీమ కుట్టినట్లు కూడా లేదని ఈ ఘటన తేటతెల్లం చేస్తున్నది. అంతేకాకుండా ఇసుక మాఫియాకు అధికార పార్టీ నాయకుల అండ ఉందనే వాదనలూ లేకపోలేదు. ఇంత జరుగుతున్నా మండలంలో సంబంధిత శాఖల అధికారులు చర్యలు తీసుకోవడంలో ఎందుకు వెనుకాడుతున్నారో అర్థంకావడం లేదని మండల ప్రజలు అధికారుల తీరుపై ప్రశ్నిస్తున్నారు. ఇసుక అక్రమ రవాణాను అరికట్టే విషయంలో జిల్లా ఉన్నతాధికారులు సైతం చొరవ చూపాలని కోరుతున్నారు.

### దాడి ఘటనపై ఫిర్యాదు...

ఇసుక మాఫియాకు చెందిన వ్యక్తులు తనపై దాడి చేశారంటూ బూర్గంపహాడ్ ఆర్ఐ-1 ముత్తయ్య సోమవారం పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. దాడి సమయంలో సుమారు 40మంది వరకు ఉన్నారని, కేకలు వేయడంతో సమీపంలో ఉన్న మీడియాకు చెందిన కొందరు రావడంతో ఇసుక మాఫియాకు చెందిన వారంతా పరారవ్వగా ఒకరు మాత్రం దొరికారని, భవిష్యత్‌లో అధికారులపై ఇలాంటి చర్యలకు పాల్పడకుండా చట్టపరంగా చర్యలు తీసుకోవాలని ఫిర్యాదులో పేర్కొన్నారు. డిప్యూటీ తహసీల్దార్ రాంనరేష్, రికార్డ్ అసిస్టెంట్ వినోద్‌తో కలిసి స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు ఆర్ఐ 'నమస్తే తెలంగాణ'కు తెలిపారు.

# మ్యూజియాన్ని అందంగా ముస్తాబు చేయాలి

## ఐటీడీఏ ఏపీవో డేవిడ్‌రాజ్



మ్యూజియం ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఐటీడీఏ ఏపీవో డేవిడ్‌రాజ్

భద్రాచలం, నవంబర్ 18 : ఐటీడీఏ ప్రాంగణంలో గిరిజన మ్యూజియం పనులను ముక్కోటి నాటికి పూర్తిచేసి భక్తులు ఆకర్షించేలా అందంగా ముస్తాబు చేయాలని ఐటీడీఏ ఏపీవో జనరల్ డేవిడ్‌రాజ్ మ్యూజియం కమిటీ సభ్యులకు సూచించారు. సోమవారం గిరిజన మ్యూజియం పనులను ఆయన పరిశీలించారు. మ్యూజియం ప్రాంగణంలో మట్టి ఇల్లు నిర్మించే స్థలం, బోటింగ్‌కు సంబంధించిన చెరువు, మ్యూజియం పరిసరాలను పరిశీలించి జరుగుతున్న పనులపై ఆరా తీశారు. బోటింగ్ ఏర్పాటు కోసం ఉన్న చెరువు చుట్టూ ప్రస్తుతం ఉన్న రాళ్లతో కట్టిన గోడను సిమెంటుతో ప్లాస్టరింగ్ చేయించాలని, మ్యూజియం పరిసరాలు పిచ్చిచెట్లు, పనికిరానివి ఏమున్నా వెంటనే తొలగించాలని, ఎత్తుపల్లాల భూమి ఉంటే చదును చేయించాలని పంచాయతీ ఈవో శ్రీనివాస్‌కు ఆదేశించారు. కార్యక్రమంలో ఎస్‌సీ ఎంవో రమణయ్య, పంచాయతీ ఈవో శ్రీనివాస్, మ్యూజియం ఇన్‌చార్జ్ వీరాస్వామి, టీఏ శ్రీనివాస్ పాల్గొన్నారు.

# కరాటేలో 'ప్రగతి' విద్యార్థులకు పతకాలు



పతకాలు సాధించిన విద్యార్థులతో యాజమాన్యం

బూర్గంపహాడ్, నవంబర్ 18 : మహబూబాబాద్‌లో 17వ తేదీ జరిగిన రాష్ట్రస్థాయి కరాటే పోటీల్లో మండల పరిధిలోని సారపాక ప్రగతి విద్యాలయం పాఠశాల విద్యార్థులకు పతకాలు సాధించినట్లు కరస్పాండెంట్ సానికొమ్ము బ్రహ్మారెడ్డి సోమవారం తెలిపారు. పాఠశాలకు చెందిన దామెర చావేజ్, అనుమల తేజశ్రీ వివిధ విభాగాల్లో మొదటి బహుమతిగా బంగారు పతకాలు సాధించగా, ఎస్.నవీన, ఎ.రిత్విక్, ఎస్.కిరణ్‌కుమార్, ఏ.యోషిక్, శ్యామ్, చక్రిలు ద్వితీయ, తృతీయ బహుమతులుగా రజత, కాంస్య పతకాలను సాధించారన్నారు. విద్యార్థులతోపాటు పీఈటీ ఎస్.బాలకృష్ణను ప్రత్యేకంగా అభినందించారు. కార్యక్రమంలో హెచ్ఎం సత్యనారాయణ, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

# అపార్..

## (విద్యార్థి సమగ్ర సమాచారం ఇక్కడే..)

- ప్రత్యేకంగా రూపొందించిన కేంద్ర ప్రభుత్వం
- కేజీ టు పీజీ వరకు విద్యార్థి సమాచారం ఇక డిజిటల్
- ఎప్పటికప్పుడు అకడమిక్ పురోగతిని అప్‌లోడ్ చేయనున్న విద్యాశాఖ
- ఆధార్‌కార్డు తరహాలో విద్యార్థులందరికీ గుర్తింపుకార్డులు
- ఇప్పటికే అన్ని స్కూల్స్‌లో జరుగుతున్న ప్రక్రియ
- భవిష్యత్‌లో కీలకం కానున్న 'అపార్‌కార్డు'



ప్రభుత్వ పాఠశాలలో చదువుకుంటున్న విద్యార్థులు

అశ్వారావుపేట, నవంబర్ 18 : ప్రతి విద్యార్థి విద్యా విషయక పురోగతిని డిజిటల్ లాకర్‌లో భద్రపరిచేందుకు కేంద్ర ప్రభుత్వం అపార్(ఆటోమేటెడ్ పర్మినెంట్ అకడమిక్ అకౌంట్ రిజిస్ట్రీ)ను అందుబాటులోకి తీసుకొచ్చింది. ఇందుకోసం వెబ్‌సైట్‌లో ఒక హోమ్ పేజీలో విద్యార్థుల సమగ్ర సమాచారాన్ని భద్రపరుస్తున్నది. జాతీయస్థాయిలో జీవితకాలంపాటు ఉపయోగపడేలా 12 అంకెలతో కూడిన ప్రత్యేక గుర్తింపుకార్డును జారీ చేయనున్నది. దీని ఆధారంగా విద్యార్థి వివరాలను(ఎల్‌కేజీ టు పీజీ వరకు) విద్యాశాఖాధికారులు 'అపార్'లో నమోదు చేస్తారు. ఈ గుర్తింపుకార్డుతోపాటు క్యూఆర్ కోడ్‌ను అందిస్తారు. ఈ గుర్తింపుకార్డు ఆధారంగా విద్యార్థులు ఎక్కడ నుండైనా వారి ధ్రువీకరణ పత్రాలు పొందే వీలుంటుంది. ప్రభుత్వం నిర్దేశించిన అంశాలకు సంబంధించిన పురోగతిని ఆయా పాఠశాలల నిర్వాహకులు ఎప్పటికప్పుడు అపార్‌లో అప్‌లోడ్ చేస్తారు. ప్రతి ఏడాది అకడమిక్ సంవత్సర వివరాలను అందులో పొందుపరుస్తారు. విద్యార్థులు ఒక పాఠశాల నుంచి మరో పాఠశాలకు మారినా, ఉన్నత విద్య, ఉద్యోగావకాశాల కోసం దరఖాస్తు చేసుకునేటప్పుడు ఈ వ్యవస్థ ద్వారా సమగ్ర సమాచారం అందుబాటులో ఉంటుంది. ఇప్పటికే అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో ఈ ప్రక్రియ జరుగుతుండగా త్వరలోనే గుర్తింపుకార్డులు ఇవ్వనున్నారు.

### తల్లిదండ్రుల అనుమతి తప్పనిసరి

పాఠశాలల విద్యార్థులు మైనర్లు కావడంతో వారి నైతిక ప్రమాణాలు, వ్యక్తిగత సమాచారం నిక్షిప్తం చేసేందుకు తల్లిదండ్రుల అనుమతి తప్పనిసరి. దీంతో పాఠశాలల ప్రధానోపాధ్యాయులు తల్లిదండ్రులతో సమావేశాలు నిర్వహించి 'అపార్' అవశ్యకతను వివరిస్తూ ప్రత్యేకంగా ముద్రించిన పత్రంపై సంతకాలు తీసుకుని అంగీకారం పొందుతున్నారు. తల్లిదండ్రులు ఇచ్చిన అనుమతిపత్రాలను పాఠశాలల్లో భద్రపరిచి దాని డిజిటల్ కాపీని పాఠశాల సమన్వయకర్త ద్వారా యూడైస్ ప్లస్ పోర్టల్‌లో నిక్షిప్తం చేస్తారు.

### నమోదు ఇలా...

ఇప్పటికే వివిధ పాఠశాలల్లో చదువుకుంటున్న విద్యార్థుల సమాచారాన్ని జాతీయస్థాయిలో 'యూడైస్ ప్లస్' వైబ్‌సైట్‌లో అధికారులు నమోదు చేశారు. దానికి అనుగుణంగా 'అపార్' గుర్తింపు కార్డు కోసం ప్రధానోపాధ్యాయుడి ధ్రువీకరణతో ఆన్‌లైన్ దరఖాస్తు చేసుకోవాలి. ఐడీ వచ్చిన తర్వాత ధ్రువీకరణ కోసం తల్లిదండ్రులు నమోదు చేసుకున్న ఫోన్‌నెంబర్‌కు నిర్ధారణ కోసం ఓటీపీ వస్తుంది. ఈ ఓటీపీని నమోదు చేయగానే ఆన్‌లైన్‌లో 'అపార్' గుర్తింపుకార్డు జారీ అవుతుంది. విద్యార్థి బ్యాంక్ ఖాతా వివరాలతో ఇది అనుసంధానమవుతోంది. విద్యార్థులు ప్రవేశ పరీక్షలు, ఉపకార వేతనాలు, ఉద్యోగ భర్తీ సమయంలో 'అపార్' కీలకంగా ఉంటుంది.

### భవిష్యత్‌లో 'అపార్' కీలకం



విద్యార్థులకు 'అపార్' గుర్తింపుకార్డు భవిష్యత్‌లో కీలకంగా ఉంటుంది. పాఠశాలల విద్యార్థులు మైనర్లు కావడం వల్ల వైబ్‌సైట్‌లో వ్యక్తిగత, నైతిక ప్రమాణాలను నమోదు చేసేందుకు తల్లిదండ్రుల నుంచి అనుమతిపత్రాలు తీసుకుంటున్నాము. ఇందుకోసం విద్యార్థుల తల్లిదండ్రులతో ప్రత్యేకంగా సమావేశాలు నిర్వహించి 'అపార్' ఆవశ్యకతను వివరిస్తున్నాం. ఈ ప్రక్రియ నిరంతరం కొనసాగుతుంది.

– పి.ప్రసాదరావు, ఎంఈవో, అశ్వారావుపేట

## 'నేస్తం'తో అభాగ్యులకు నిరంతర సేవలు



వేడుకల్లో పాల్గొన్న ట్రస్టు బాధ్యులు

బూర్గంపహాడ్, నవంబర్ 18 : మండలంలోని మోరంపల్లిబంజర్ గ్రామంలో నిరుపేదలకు ఆర్థికసాయం చేయాలనే తలంపుతో ఏర్పాటు చేసిన 'నేస్తం' చారిటబుల్ ట్రస్టు 13ఏళ్లు అయిన సందర్భంగా వార్షికోత్సవ వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా ట్రస్టు చైర్మన్ బత్తుల రామకొండారెడ్డి వార్షికోత్సవ వేడుకల్లో భాగంగా కేక్ కట్ చేసి అనంతరం మాట్లాడారు. నేస్తం ట్రస్టు పేద విద్యార్థుల చదువుకు ఆర్థికసాయం, అనారోగ్యంతో బాధపడుతున్న వారికి సాయం చేయడంలో ముందుంటుందన్నారు. కార్యక్రమంలో ట్రస్టు వైస్ చైర్మన్ చింతా అంకిరెడ్డి, కార్యదర్శి ఇండ్ల రాజేష్, కోశాధికారి కె.రాజేందర్‌రెడ్డి, సభ్యులు సంకా సురేష్, రామిరెడ్డి, బాలనారాయణరెడ్డి, నాగార్జున, కె.రమేష్‌రెడ్డి, శివనాగిరెడ్డి, వెంకట్రామిరెడ్డి పాల్గొన్నారు.

## అయ్యప్ప మాలధారుల పాదయాత్ర



ఆళ్ళపల్లి, నవంబర్ 18 : మండల పరిధిలోని మర్కోడు గ్రామానికి చెందిన అయ్యప్ప మాలధారులు సోమవారం పాదయాత్ర నిర్వహించారు. స్వేచ్ఛాయుత వాతావరణంలో ప్రజలందరూ ఆయురారోగ్యాలతో ప్రశాంతంగా జీవించాలని, శబరిమలలో భక్తులందరికీ అయ్యప్పస్వామి దివ్యదర్శనం కలగాలని మర్కోడు నుంచి పాతూరు సమీపంలోని ఉడుముల గుట్టపై ఉన్న శ్రీ లక్ష్మీనర్సింహస్వామి ఆలయానికి 10 కిలోమీటర్లు వెళ్లి ప్రత్యేకపూజలు చేశారు. కార్యక్రమంలో మల్లికార్జున్, రమేష్, శ్రీను, సుబ్బరావు, కృష్ణహరి, వీరభద్రచారి, దయాకర్, సద్గుణాచారి, సుధాకర్, కోటేష్, వేణు, కిరణ్, నవీన్, చింటూ, సాయికిరణ్ పాల్గొన్నారు.

## వేతన బకాయిలు చెల్లించాలి

దమ్మపేట రూరల్, నవంబర్ 18: పంచాయతీ కార్మికులకు వేతన బకాయిలు చెల్లించాలని ఏఐటీయూసీ మండల అధ్యక్షుడు బెజవాడ రాము ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. దమ్మపేటలోని సీపీఐ కార్యాలయంలో సోమవారం పంచాయతీ కార్మికుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వం వెంటనే వేతనాలు చెల్లించకపోతే ప్రత్యక్ష కార్యాచరణ చేపడతామన్నారు. నాయకులు ధర్మా, బసవయ్య, పుల్లారావు పాల్గొన్నారు.

## కలెక్టరేట్ ఎదుట ధర్నా

కొత్తగూడెం టౌన్, నవంబర్ 18: కొత్తగూడెంలో అక్రమ నిర్మాణాలకు వ్యతిరేకంగా హైకోర్టు ఇచ్చిన ఆదేశాలను అమలు చేయాలన్న డిమాండుతో బీఎస్పీ నాయకులు సోమవారం కలెక్టరేట్ ఎదుట ధర్నా చేశారు. యెర్రా కామేష్, మాలోత్ వీరూనాయక్, జెట్టి ఆనందరావు, వంగా రవిశంకర్, కవిత, దీపిక పాల్గొన్నారు.

## ఆర్థిక ఇబ్బందులు తాళలేక వివాహిత ఆత్మహత్య



జల్లారపు సాగరిక(ఫైల్)

ఆళ్ళపల్లి, నవంబర్ 18 : ఆర్థిక ఇబ్బందులు తాళలేక ఓ వివాహిత ఆత్మహత్యకు పాల్పడిన ఘటన మర్కోడు గ్రామంలో చోటుచేసుకుంది. ఎస్సై రతీష్, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం... జల్లారపు సాగరిక(32)కు రంజిత్‌తో 11 సంవత్సరాల వివాహం జరిగింది. రంజిత్‌ది లక్ష్మీదేవిపల్లి మండలం, అనిశెట్టిపల్లి గ్రామం. బతుకుదెరువు రిత్యా అత్తగారి ఊరైన మర్కోడు గ్రామం వచ్చి 8 సంవత్సరాలుగా రంజిత్ తాపీమేస్త్రీ పని, సాగరిక కుట్టుమిషన్ పనిచేస్తూ జీవనం సాగిస్తున్నారు. ఆర్థిక ఇబ్బందులు తాళలేక మనస్థాపం చెందిన సాగరిక సోమవారం ఉదయం ఎవరు లేని సమయంలో ఇంట్లో ఉన్న ఫ్యాన్‌కి ఉరి వేసుకొని ఆత్మహత్యకు పాల్పడింది. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు ఎస్సై రతీష్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతురాలికి కుమారుడు, కూతురు ఉన్నారు.